సాక్షి
వికారాబాద్

శనివారం । 9 । ఆగస్టు । 2025



పంటలకు నష్టం

భారీ వర్షానికి పంటలు పాడయ్యాయి. అప్పలు తెచ్చి సాగు చేస్తే ఏకధాటి వానకు నేలకొరిగాయి.

8లో▸



కేజీబీవీ వద్ద పడిగాపులు

రాఖీ పౌర్ణమి నేపథ్యంలో విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పలేదు.

8లో▸




ఊరికి దూరంగా..

గ్రామాలకు దూరంగా రైతు వేదికలు ఉండటంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

9లో▸

సెల్ఫీ విత్ రాఖీ



అక్కాచెల్లెళ్ల ఆత్మీయ వేడుక రక్షాబంధన్. ఈ పర్వదినాన సోదరులకు కట్టే రాఖీ.. ప్రేమానురాగాలకు ప్రతిరూపంగా నిలుస్తుంది. ఈ వేడుకను మరింత ప్రత్యేకంగా చూపించాలనే ఉద్దేశంతో 'సెల్ఫీ విత్ రాఖీ' ఫొటోలను ఆహ్వానిస్తోంది 'సాక్షి'. మీ కుటుంబం, సమూహంలో శనివారం నిర్వహించిన రాఖీ సంబరాలను సెల్ఫీ తీసుకుని పంపిస్తే బాగున్నవాటిని ఎంపిక చేసి ప్రచురిస్తాం. ఫొటోతో పాటు మీ పట్టణం లేదా గ్రామం పేరు రాసి పంపండి. పర్యావరణ హిత రాఖీలకు ప్రాధాన్యం ఉంటుంది.


మీరు వాట్సప్ చేయాల్సిన నంబర్లు

92906 11217, 98669 34975

న్యూస్‌రీల్

రాఖీ శుభాకాంక్షలు

స్పీకర్ ప్రసాద్‌కుమార్



అనంతగిరి: జిల్లా ప్రజలకు స్పీకర్ ప్రసాద్ కుమార్ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్ అన్నారు. తన సోదరుడు గొప్పగా ఉండాలని, తనకు కొండంత అండగా నిలవాలని ఆకాంక్షిస్తూ సోదరి రాఖీ కడుతుందన్నారు.

బాధ్యతలు చేపట్టిన మంగీలాల్



కలెక్టర్‌కు మొక్కను బహూకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి మంగీలాల్

అనంతగిరి: జిల్లా రెవెన్యూ అధికారిగా మంగీలాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగీలాల్ వరంగల్ హనుమకొండ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

వాగును విడిపించకుండా తవ్వకాలు ఏమిటి ?

చిలుకవాగు పనులను అడ్డుకున్న స్థానిక రైతులు



రైతులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి

తాండూరు: రియల్ వ్యాపారులు కబ్జా చేసిన చిలుక వాగును విడిపించకుండా, తమ పొలాల నుంచి వాగును తరలించడంపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ మార్గం సాయిపూర్ ప్రాంతంలో శుక్రవారం చేపట్టిన వాగు తవ్వకం పనులను అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి వెళ్లి సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. చిలుక వాగు పరివాహక ప్రాంతం తమ పొలాల మధ్య నుంచి వెళ్లదని తెలిపారు. ఆక్రమణలను తొలగించకుండా తమ భూముల పైనుంచి తవ్వకాలు చేపట్టడం ఏమిటని ఆవేదన వ్యక్తంచేశారు.

పాల ఉత్పత్తులపై అవగాహన

యాచారం: పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం గునుగల్, గడ్డమల్లయ్యగూడ గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కొండల్‌రెడ్డి, ఫార్మర్ డీన్ డాక్టర్ రఘునందన్ తదితరులు శాస్త్రీయ పద్ధతిలో పాడిపశువుల పెంపకం, పాల పదార్థాల తయారీపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. పశుపోషణ, తక్కువ ఖర్చుతో షెడ్ల నిర్మాణం, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వంటి అంశాలను వివరించారు. కలాకండ్, పన్నీరు, చన్నారసగుల్లా, రసమలై, మజ్జిగ, లస్సీ తదితర పదార్థాల తయారీపై అవగాహన కల్పించి, శిక్షణ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు రత్నాకర్, శశికుమార్ పాల్గొన్నారు.



ధారూరు: నాగసముందర్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

వరాల తల్లీ వందనం

వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే ఆలయాలకు చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. అమ్మవారిక ఒడిబియ్యం సమర్పించారు. ఇళ్లల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజకు వచ్చిన తోటి మహిళలకు వాయినాలు ఇచ్చారు. ఆలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి.

– వికారాబాద్



అనంతగిరి: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వరద సమస్యకు మూసీ పునరుజ్జీవమే పరిష్కారం

భారీ వర్షాలు కురిసినా తట్టుకొనేలా వ్యవస్థల ప్రక్షాళన

- నీటి ప్రవాహానికి వీలుగా డ్రైనేజీలు, ట్రాఫిక్ చిక్కుల్లేకుండా చర్యలు
- చెరువులు, కుంటలు, నాలాలు ఎస్టీపీల ద్వారా మూసీకి అనుసంధానం
- అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



శుక్రవారం హైదరాబాద్‌లో అత్యవసర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరంలో భారీ వర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూసీ నది పునరుజ్జీవం ద్వారానే వరద నీటిని సమర్థంగా నిర్వహించవచ్చని ఆయన పేర్కొన్నారు. వర్షాలతో నగర జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండాలంటే శాశ్వత ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను మరో వందేళ్ల భవిష్యత్ అవసరాలను అంచనా వేసుకొని కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఢిల్లీ నుంచి శుక్రవారం మధ్యాహ్నం నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి.. గురువారం రాత్రి హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షంతో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్‌లో మరోసారి పునరావృతం కాకుండా అనుసరించాల్సిన తక్షణ, శాశ్వత చర్యలపై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు.

వాతావరణ మార్పులతోనే..

నగరంలో గురువారం రాత్రి కుండపోత వర్షానికి వాతావరణ మార్పులే ప్రధాన కారణమని, అందుకు తగినట్లుగా నగరంలో అన్ని వ్యవస్థలను ఆధునీకరించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా సీఎం అభిప్రాయపడ్డారు. భారీ వర్షాలతో తలెత్తే ఈ విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు విపత్తుల నివారణ నిర్వహణ ప్రణాళిక సమర్థంగా అనుసరించాలని ఆదేశించారు. ఎలాంటి భారీ వర్షాలైనా తట్టుకొనేలా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును వెంటనే చేపట్టాలన్నారు. నగరంలో 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటం ద్వారా పరీవాహక ప్రాంతంతో పాటు అన్ని ప్రాంతాలు, కాలనీలకు వరద ముప్పును నివారించవచ్చన్నారు.

మూసీలో వరద నీరు చేరేలా..

ఓఆర్ఆర్ లోపల ఉన్న కోర్ అర్బన్ ప్రాంతంలో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అన్ని వైపుల నుంచి వరద నీరు మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. హుస్సేన్ సాగర్, దుర్గం చెరువు, మీరాలం చెరువులతో పాటు అన్ని చెరువులు, కుంటలను నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలన్నారు. డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎస్టీపీ (సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ల) ద్వారా శుద్ధి చేసి మూసీలోకి వదలాలని చెప్పారు. నగరంలో ఎక్కడ వర్షం పడినా మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలన్నారు. ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలని చెప్పారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాత నగరంలో పెడెస్ట్రియల్ జోన్ ఏర్పాటు చేసి పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ పరిధిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఇలంబర్తి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, జేఎండీ గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా వేడుకలను జయప్రదం చేయాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు నిర్వహించనున్నందున అతిథుల కోసం వేదికపై ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలపై శాఖల వారీగా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా రెవెన్యూ అధికారి మంగీలాల్, అడిషనల్ ఎస్పీ మురళీధర్, ఆర్డీఓ వాసుచంద్ర పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి

- బోరుమోటారు సర్వీస్ వైర్ సరిచేసే క్రమంలో షాక్
- ముద్దాయిపేటలో విషాదం



రమేశ్ గౌడ్ (ఫైల్)

యాలాల: వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ యువ రైతు మృత్యువాత పడ్డాడు. యాలాల మండలం ముద్దాయిపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాలేపల్లి రమేశ్‌గౌడ్(38) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వరి సాగుకు కరిగేట్లు సిద్ధం చేసుకుని శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లాడు. ఈ సమయంలో బోరుకు కరెంటు సరఫరా చేసే సర్వీస్ వైర్ తెగిపడి ఉండటాన్ని గమనించాడు. దీన్ని అతికించే క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అటుగా వెళ్తున్న రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించగా రమేశ్ అప్పటికే చనిపోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య గౌరమ్మ, కొడుకు ప్రదీప్, కూతురు శ్రీజ ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే రమేశ్ మృతిని గ్రామస్తులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. పలు పార్టీల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రమేశ్ అకాల మరణంతో ముద్దాయిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైల్‌రెడ్డి

కాంగ్రెస్‌కు ప్రజాగ్రహం తప్పదు

- పెద్దేముల్‌లో పార్టీ జెండా ఎగురవేస్తాం
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రజాగ్రహం చవిచూడక తప్పదని, అది ఎంతో దూరం లేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరులోని మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద పెద్దేముల్, కోట్‌పల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రోజుకో డ్రామా ఆడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుతాం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దేముల్ మండలంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకుంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమించి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, నాయకులు రమేష్, మహేందర్, అంజయ్య, జనార్దన్‌రెడ్డి, రాములు, నరేష్‌రెడ్డి, సిబ్లీ, శ్రావణ్, వీరప్ప, శ్రీనివాస్‌రెడ్డి, రంగయ్య, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ ఆర్‌సెటీ డైరెక్టర్ మహ్మద్ అలీఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో కార్ డ్రైవింగ్, మొబైల్ రిపేరింగ్, బైక్ మెకానిక్, సీసీటీవీ కోర్సుల్లో నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ నెల 11న శిక్షణ మొదలవుతుందని.. 18 – 45 సంవత్సరాల మధ్య వయసు ఉండి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎస్ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలతోపాటు నాలుగు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో ఈ నెల 9న ఆర్‌సెటీ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నా రు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం,వసతి సౌకర్యంతో, ట్రైనింగ్ మెటీరియల్,టూల్ కిట్స్ ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. వివరాలకు 9550606019, 85001 65190 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించిన ఫెడరేషన్ నాయకులు

పారదర్శకంగా నిర్వహించాలి

అనంతగిరి: ఉపాధ్యాయుల పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ కోరారు. శుక్రవారం వికారాబాద్‌లో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం అర్హత లేని వారికి 3 జిల్లాల్లో డీఈఓలుగా నియమించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ అధ్యక్షుడు దేవయ్య, నాయకులు జాంప్లా, శివప్ప, బాలకృష్ణ, బాబు శ్రీనివాస్, వీరయ్య సంతోష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



రాఖీ సందడి

అన్నాచెల్లెల్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా వికారాబాద్ పట్టణంలో ప్రత్యేక షాపులు వెలిశాయి. వివిధ ఆకృతులు, రంగులు, సైజుల్లో గల రాఖీలను అందుబాటులో ఉంచారు. మహిళలు, యువతులు వాటిని కొనుగోలు చేసేందుకు తరలివచ్చారు. దీంతో దుకాణాలన్నీ సందడిగా కనిపించాయి. డిజైన్లను బట్టి ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. స్వీట్ షాపుల్లోనూ సందడి నెలకొంది.

– అనంతగిరి

క్లుప్తంగా

16 మేకల అపహరణ

దోమ: గుర్తు తెలియని దుండగలో కొట్టంలో ఉన్న మేకలను అపహరించుకుపోయారు. ఈ ఘటన దోమ ఠాణా పరిధిలోని ఉదన్‌రావుపల్లిలో శుక్రవారం వెలుగుజూసింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నీరటి సాయిలు మేకలు సాకుతూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం జీవాలను మేపిన తర్వాత సాయంత్రం పాకలో ఉంచి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వచ్చి చూడగా 16 మేకలు అపహరణకు గురయ్యాయి. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కొండముచ్చుకు అంత్యక్రియలు


కొండముచ్చు కళేబరం

బషీరాబాద్: చెట్టుమీద నుంచి కిందపడి మృతి చెందిన కొండముచ్చుకు శుక్రవారం పర్వత్‌పల్లిలో యువకులు అంత్యక్రియలు చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం దగ్గర చెట్టు మీద నుంచి మరో చెట్టుమీదకు దూకుతున్న క్రమంలో కిందపడి అక్కడికక్కడే మృత్యువాత పడింది. గమనించిన యువకులు కొత్త వస్త్రాలు కట్టించి డప్పు చప్పులతో ఊరేగింపు చేసి గ్రామ శివారులో ఖననం చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


రంగంపల్లిలో వేలాడుతున్న 11కేవీ విద్యుత్ వైర్లు

పరిగి: విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని రంగంపల్లిలో నర్సింహులు రైతు పొలంలో మీదుగా 11 కేవీ విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. వానాకాలం సీజన్ సాగులో ట్రాక్టర్ పనుల్లో వాహనాలకు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉందని.. తీగలను సరి చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

నందిగామ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ పంచాయతీ పృథ్వీకాలనీలో శుక్రవారం హనుమాన్ ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. హనుమాన్ ఆలయ ఆవరణలో మార్క కుమార్ యాదవ్ ఆర్థిక సహాయంతో నూతనంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీవైస్ చైర్మన్ గణేష్, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, కొత్తూరు మాజీ ఎంపీపీ మదుసూధన్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ సర్పంచులు అశోక్, కుమార్, మాజీ ఉప సర్పంచ్ కుమార్, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీ..

ద్విచక్ర వాహనదారుడు మృతి

మాడ్గుల: ట్రాక్టర్ ఢీకొట్టి ఓ ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చౌటకుంట తండా సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ వేణుగోపాల్‌రావు తెలిపిన ప్రకారం.. నర్సంపల్లికి చెందిన పోలే మొగులయ్య(45) తన భార్య, కుమారుడితో కలిసి ఇర్విన్‌లో ఉన్న బ్యాంకుకు బయలు దేరాడు. మార్గమధ్యలో చౌటకుంట తండా సమీపంలో బైక్ ముందుకు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌కు ఎదురుగా ఓ ట్రాక్టర్ రావడంతో సైడ్ ఇచ్చేందుకు వెనకాల ఉన్న బైక్‌ను గమనించకుండా వాహనాన్ని రివర్స్ తీశాడు. దీంతో ద్విచక్రవాహనదారుడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య, కుమారుడికి స్వల్పగాయాలయ్యారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉత్సవాలకు ఆహ్వానం

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ వార్షిక వేడుకలు ఈనెల 11 నుంచి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు రావాలంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డితో కలిసి బీఆర్ఎస్ నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, నాయకులు జెల్లాల లక్ష్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పంటలకు నష్టం

- నేలకొరిగిన పత్తి, మొక్కజొన్న
- పరిహారం అందించాలని రైతుల వినతి

దోమ: భారీ వర్షానికి పంటలు పాడయ్యాయి. అప్పులు తెచ్చి సాగు చేపడితే ఏకదాటి వర్షానికి నేలకొరిగాయి. గురువారం సాయంత్రం మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గంటపాటు వర్షం కురిసింది. ఈ క్రమంలో మొక్కజొన్న, పత్తి పంటల్లో నీరు చేరాయి. దీంతో పంట నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

పరిహారం అందించాలి

మండల వ్యాప్తంగా 36 పంచాయతీల్లో పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. ఒడల పరిధిలోని 1,118 ఎకరాల్లో మొక్కజొన్న, 1,830 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.


బొంపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న

నాలుగు ఎకరాల్లో..



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. గురువారం కురిసిన వర్షానికి పంట మొత్తం పాడైంది. అప్పు తెచ్చి సాగు చేశాం. అప్పులు తీర్చే మార్గం ఆవేదన చెందుతున్నాం. అధికారులు పంట నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.

– బాల్‌రాజ్, రైతు, బొంపల్లి

పరిహారంపై స్పష్టత లేదు



రైతులు అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించే విషయంలో స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ప్రభాకర్‌రావు, ఏఓ, దోమ



విన్యాసాలు అదుర్స్

గురునానక్ కళాశాలలో ఎన్ఎస్‌జీ కమాండోల ప్రత్యేక విన్యాసం

ఇబ్రహీంపట్నం: గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో దేశ రక్షణ, వాయుసేన దళాలు శుక్రవారం ప్రత్యేక విన్యాసాలు నిర్వహించాయి. హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రానికి చెందిన నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ), భారత రక్షణ వాయుసేన (ఐఏఎఫ్) సంయుక్తంగా హెలికాప్టర్ల సాయంతో ×హై–ఇంటెన్సిటీ రూఫ్ టాప్ స్లిదరింగ్× పేరిటన విన్యాసాలు ప్రదర్శించాయి. ఉగ్రమూకల దాడులు, యుద్ధ పరిస్థితులు, ప్రమాద సంఘటనలు చోటుచేసుకుంటే విపత్కర, అత్యవసర సమయాల్లో ప్రజలను ఏ విధంగా కమాండోలు కాపాడతారో కళ్లకు కట్టినట్లుగా చూపించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి, ఎండీ హెచ్ఎస్ సైనీ, ఎన్ఎస్‌జీ దళాల కమాండోలు, అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాది బలవన్మరణం

- ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఆత్మహత్య
- చర్లపటేల్‌గూడలో విషాదం


నరేందర్‌గౌడ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఆర్థిక ఇబ్బందులతో ఓ న్యాయవాది బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో గురువారం అర్ధ రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపటేల్‌గూడకు చెందిన న్యాయవాది పి.నరేందర్‌గౌడ్(34)కు ఇదే వృత్తిలో ఉన్న చంద్రికతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఇరువురూ ఇబ్రహీంపట్నం న్యాయస్థానంలో కేసులు వాదిస్తున్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న నరేందర్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. గురువారం మధ్యాహ్నం పన్నెండున్నర గంటల ప్రాంతంలో కోర్టుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అతన్ని వెతుకుతున్న క్రమంలో తమ వ్యవసాయ క్షేత్రంలోని పశువుల కొట్టంలో ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు బాడీని ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కేజీబీవీ వద్ద పడిగాపులు

విద్యార్థులను పంపకపోవడంతో తల్లిదండ్రుల ఆందోళన


కేజీబీవీ ఎదుట వేచి ఉన్న తల్లిదండ్రులు

దోమ: రాఖీ పౌర్ణమి నేపథ్యంలో విద్యార్థులను ఇంటికి తీసుకువెళ్లేందుకు కేజీబీవీకి వచ్చిన తల్లిదండ్రులకు అసహనానికి లోనయ్యారు. వివరాలు.. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లేందుకు ఉదయం 9గంటలకే సుమారు 40 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. కాగా పాఠశాల విద్యార్థులు గేట్ ఓపెన్ చేయలేదు. మధ్యాహ్నం తర్వాత పంపిస్తామని చెప్పారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చిన వెంటనే పంపించడంతో మిగిలిన వారు ఒకింత ఆగ్రహానికి లోనయ్యారు. ఉపాధ్యాయుల పరిచయస్తులుంటే వెంటనే పంపించారని మండిపడ్డారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఈఓ పైరవీలతోనే పని చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఎంఈఓ వెంకట్, పాఠశాల ఎస్‌ఓ శైలజను వివరణ కోరగా.. అనారోగ్యంతో ఇబ్బంది పడేవరానికి, దూర భారం ఉన్నవారిని పంపించామని.. మిగిలిన వారిని మధ్యాహ్న భోజనం తర్వాత పంపిస్తామని చెప్పామన్నారు.

కూరగాయలకు వెళ్లి.. వరదనీటిలో మునిగి..

వలస కూలి మృతి


ఇంద్రప్ప మృతదేహం

మొయినాబాద్: కూరగాయలు తెచ్చేందుకు ఇంటి నుంచి వెళ్లిన ఓ వలస కూలి వరద నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో శుక్రవారం వెలుగుజూసింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. నారాయణఖేడ్ జిల్లా దామరగిద్దకు చెందిన వంశిరాజు ఇంద్రప్ప(50), భార్య అంజమ్మతో కలిసి రెండు నెలల క్రితం బతుకుదెరువుకోసం హిమాయత్‌నగర్‌కు వలస వచ్చారు. కూలీపని చేస్తూ అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. కాగా గురువారం రాత్రి 7 గంటల సమయంలో ఇంద్రప్ప కూరగాయలు తేవడానికి బయటకు వెళ్లాడు. ఆ సమయంలో భారీ వర్షం కురిసింది. దీంతో హిమాయత్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై వరదనీరు పెద్ద ఎత్తున చేరింది. రోడ్డుపైన నిలిచిన వరదనీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఇంద్రప్ప కల్వర్టు వద్ద గుంతలో పడి నీటిలో మునిగిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలోనే మునిగి మృతి చెందాడు. తన భర్త తిరిగి రాలేదని అంజమ్మ రాత్రి సమయంలో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం తిరిగి వెతుకుతుండగా హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఉడిపి హోటల్ దగ్గర ఉన్న కల్వర్టు గుంతలో మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మంత్రగాడి ముసుగులో మోసం


కొత్తూరు: తాను పూజలు చేస్తే నరదిష్టి తొలిగి ఐశ్వర్యం కలుగుతుందంటూ నమ్మబలికిన ఓ మంత్రగాడు శుక్రవారం ఎస్‌బీపల్లిలో మోసానికి యత్నించాడు. ప్రత్యేక వేషధారణలో గుర్తు తెలియని వ్యక్తి ఉదయం గ్రామానికి వచ్చి ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలను తన పూజలతో బాగు చేస్తానని పలువురికి చెప్పాడు. ఈ పూజలకు ఒక్కొక్కరికి రూ.పదివేలు ఖర్చవుతుందని చెప్పాడు. విషయం తెలు సుకున్న గ్రామ యువత మంత్రగాడి వద్దకు చేరుకు ని ఏం పూజలు చేస్తావంటూ ప్రశ్నించారు. ఎందుకు అంత డబ్బు ఇవ్వాలని నిల దీయడంతో వారి నుంచి తప్పించుకుని పరారయ్యాడు.

రోడ్డు పనులు అడ్డుకుంటున్న వ్యక్తిపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కేశంపేట: రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రైతుపై చర్యలు తీసుకోవాలని గోప్లాయకుంటతండా వాసులు శుక్రవారం తహసీల్దార్ అజాంఅలీకి వినతిపత్రం అందజేశారు. వివరాలు.. బైర్కాన్‌పల్లి శివారు గోప్లాయకుంట తండాకు 20 ఏళ్ల క్రితం కంకర రోడ్డును వేశారు. ప్రస్తుతం బీటీ రోడ్డు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న రైతు తన పొలం పక్క నుంచి రోడ్డు వేయాలంటూ నిత్యం కాంట్రాక్టర్‌ను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆరోపించారు. రోడ్డు నిర్మాణ మార్గం మార్చితే మిగిలిన రైతుల పొలాలు నీటమునుగుతాయని.. అధికారులు స్పందించి పాతరోడ్డు మాదిరిగానే బీటీ రోడ్డు వేసేలా తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాయికంటి రాంచంద్రయ్య, కరుణాకర్, నర్సింహ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ శంకర్‌పల్లిలో భాగస్వాములుకండి


సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్న సినీనటుడు సునీల్

శంకర్‌పల్లి: మున్సిపల్ ప్రజలంతా స్వచ్ఛ శంకర్‌పల్లిలో భాగస్వాములు కావాలని సినీ నటుడు సునీల్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 100 రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా ఆయన సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణ మున్సిపల్ శాఖ 'మా ర్పు– అభివృద్ధికి మలుపు' నినాదంతో ముందుకు వెళ్తూ.. 100 రోజుల ప్రణాళిక చేపట్టిందని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ ఆటోల్లో వేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, అవకాశం ఉన్నచోట విరివిగా మొక్కలు నాటాలని కోరారు. 'స్వచ్ఛ తెలంగాణ– స్వచ్ఛ శంకర్‌పల్లి' కోసం ప్రతి ఒక్కరం కృషి చెద్దామన్నారు.

ఓటర్ల వివరాలు పక్కాగా ఉండాలి

కందుకూరు: వార్డుల ప్రకారం ఓటర్ల లిస్టును పకడ్బందీగా తయారు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీపీఓ సురేష్‌మోహన్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. లిస్టులో ఓటర్ల వివరాలు మిస్సింగ్ కావద్దని అన్నారు. అందరూ అప్రమత్తంగా ఉండి వెంటనే వివరాలు నమోదు చేయాలన్నారు. అంతకుముందు కొత్తూర్ పరిధిలోని గోదాంలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌మోహన్

వరదలోకి దిగి.. సురక్షితంగా తరలించి

నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి సరూర్‌నగర్ డివిజన్ పరిధి బాపూనగర్, జేబీకాలనీ,విజయపురికాలనీ రోడ్లు చెరువులను తలపించాయి. స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారంతో వాహనదారులు, మహిళలను సురక్షితంగా తరలించారు.

– హుడాకాంప్లెక్స్



దారి తప్పిన ప్లానింగ్



ట్రాఫిక్ టెర్రర్‌తో నగరంలో నరకం

- నాలాల సమస్యకు పరిష్కారం శూన్యం
- ఇంజినీరింగ్ లోపాలే ప్రధాన కారణం
- ప్రణాళికలు లేని అధికారులు, పాలకులు
- బుట్టదాఖలైన కిర్లోస్కర్ కమిటీ నివేదిక

సాక్షి, సిటీబ్యూరో: చిన్న వర్షం కురిస్తే రోడ్లన్నీ జలమయం... ఎక్కడి వాహనాలక్కడే నిలిచిపోవాల్సిందే.. ఇక ఎక్కడైై ప్రమాదం జరిగినా.. రోడ్డు గుంత పడినా.. వాహనం బ్రేక్‌డౌన్ అయినా గంటల తరబడి ట్రాఫిక్ జామే.. వీటన్నింటికీ ప్రధాన కారణం ఇంజినీరింగ్ లోపాలే. రహదారులు, కూడళ్లను శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిర్మించకపోవడం. ట్రాఫిక్ కానీ, నాలాల విషయంలో కానీ మన అధికారులు, పాలకులు ఇంజినీర్ల పాత్ర విస్మరించడంతోనే ఈ పరిస్థితులు దాపురించాయి.

నాటి నివేదికలే ఇప్పటికీ దిక్కు

నిజానికి ట్రాఫిక్ నియంత్రణ బాధ్యత పూర్తిగా పోలీసులదే అనుకుంటే పొరపాటే. వాస్తవానికి ప్రధాన కూడళ్లలో సిగ్నళ్ల వద్ద నిలబడి ట్రాఫిక్ క్రమబద్ధంగా వెళ్లేందుకు మాత్రమే వారు దోహద పడతారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించడం వంటివి అదనంగా చేస్తారు. ట్రాఫిక్ సజావుగా, సాఫీగా సాగిపోయేందుకు రోడ్లు, కూడళ్లలోని జంక్షన్లు, ఫ్లైఓవర్లు, ప్రధాన రోడ్లను కలిపే యాక్సెస్ రోడ్లు వంటివి ప్రణాళికాబద్ధంగా రూపొందించకపోవడంతోనే నగరంలో ఈ సమస్యలంటున్నారు ట్రాఫిక్ నిపుణులు. నాలాల విషయంలో ఇంజినీరింగ్ ప్రముఖుడు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1920లో రూపొందించిన నివేదికలే ఇప్పటికీ పనికి వస్తున్నట్లే.. రోడ్ల విషయంలో అలాంటి ప్రణాళికలు లేకపోవడమే ఈ సమస్యకు మూలకారణమని స్పష్టం చేస్తున్నారు.

లోపాలతోనే వేగానికి తూట్లు

నగరంలో వందల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వేల కిలోమీటర్ల పొడవున రోడ్లు ఉన్నాయి. విపరీతంగా విస్తరిస్తున్న ప్రధాన రోడ్లు, వాటిని కలిపే యాక్సెస్ రోడ్లు, చిన్నా చితకా రోడ్లతో పాటు చిన్నచిన్న గల్లీలనూ లెక్కేస్తే ఆ సంఖ్య మరింత పెరుగుతుంది. వీటి నిర్మాణంలో ఎలాంటి ప్రణాళిక లేదన్నది నిపుణులు చెబుతున్న వాస్తవం. అత్యంత ప్రధానమైన రోడ్లలోనూ నానాటికీ రద్దీ పెరిగిపోతోంది. వాటికి సమాంతర రోడ్ల అభివృద్ధి అనే ఊసే లేకపోవడంతో ట్రాఫిక్ అనేక పద్మవ్యూహంలా మారిపోతోంది. వాస్తవానికి నగరంలోని ప్రధాన ఆర్టీరియల్ రోడ్లు (ప్రధాన రహదారులు) అయిన పంజగుట్ట, అమీర్‌పేట్, బేగంపేట్, సికింద్రాబాద్, తార్నాక తదితర రోడ్లన్నీ వాహనాలు కనీసం గరిష్ఠంగా 60 కి.మీ. వేగంతో వెళ్లగలిగే సామర్థ్యం ఉన్న పెద్దరోడ్లే. కానీ కేవలం ఇంజినీరింగ్ ప్రమాణాల లోపాలతోనే ఇప్పుడీ రోడ్లన్నీ ట్రాఫిక్ వలయంలో చిక్కిపోతూ సరాసరిన గంటకు కనీసం 30 కిమీ వేగంతోనూ వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాయి.

కిర్లోస్కర్ కమిటీ నివేదికా బుట్టదాఖలే..

నగరంలో 2000వ సంవత్సరం ఆగస్టులో కురిసిన భారీ వర్షం–వరద తీవ్రత ప్రజలతో పాటు ప్రభుత్వానికీ ముచ్చెమటలు పట్టించింది. దీంతో వరద నివారణ చర్యలు సిఫార్సు చేయడానికి 2003లో కిర్లోస్కర్ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ అప్పట్లో ఉన్న ఎంసీహెచ్ పరిధిలో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నాలాలను 170 కిలోమీటర్ల మేర విస్తరణ తక్షణం చేపట్టాలని, అందుకు రూ.264 కోట్లు వ్యయం అవుతుందని తేల్చింది. 2007లో నగర శివార్లలోని పన్నెండు మున్సిపాలిటీలలో మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమై జీహెచ్ఎంసీ ఏర్పడింది. ఇలా 625 చ.కి.మీల్లో విస్తరించిన గ్రేటర్‌కు సమగ్ర మాస్టర్ ప్లాన్, సూక్ష్మస్థాయి వరదనీటి పారుదల, మేజర్, మైనర్ వరద నీటి కాలువ ఆధునీకరణ కోసం సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) బాధ్యతను ఓయంట్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. దాని ప్రాథమిక అంచనా మేరకు గ్రేటర్‌లో వరద నీటి సమస్య పరిష్కారానికి అప్పట్లోనే రూ. 6247 కోట్లు అవసరం అవుతాయని తేల్చింది. ఈ నివేదికలు ప్రాథమిక స్థాయిలోనూ అమలు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదు.

అన్నీ ఉన్నా అధ్యయనమేది?

రోడ్ల నిర్మాణంలో సరైన ప్రణాళిక అవలంబించకపోవడంతోనే అసలు సమస్య వస్తోందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదైనా ఒక ప్రదేశంలో రోడ్డు నిర్మించాల్సి వస్తే దాని వల్ల ఎక్కువగా ఎవరి ప్రయోజనం... అంటే స్కూల్ జోనా? వాణిజ్య ప్రాంతమా? తదితర విషయాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరగాలి. దానికి తగ్గట్టు మార్పు చేర్పులతో రహదారి నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సిటీలో మాత్రం ఆర్టీరియల్ రోడ్లు, ఇన్నర్ రోడ్లు, ఇంటర్మీడియట్ రోడ్లు దేనికీ సరైన ప్రణాళిక, అధ్యయనం లేకుండానే నిర్మితమవుతాయి. అందుకే ట్రాఫిక్ అస్తవ్యస్తంగా కొనసాగుతోంది.

ఆ 'భుజం'కు ఊతమేది?

నగరంలో ఎక్కడైనా ప్రమాదం జరిగినా, బస్సు వంటివి బ్రేక్ డౌన్ అయినా గంటల తరబడి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవాల్సిందే. నిజానికి ప్రధాన ఆర్టీరియల్ రోడ్లు ఒక్కోటి 2.5 మీటర్ల వెడల్పుతో కనీసం నాలుగు లైన్లుగా ఉండాలి. దీనితో పాటు ఆ రోడ్డుకు సాంకేతికంగా 'షోల్డర్స్' అని పిలిచే ఖాళీ ప్రదేశం ఉండాలి. ఎందుకంటే ఆ మార్గంలో ఏదైనా వాహనం పాడయితే అది మిగతా వాహనాలకు అవాంతరం కాకుండా ఉండేందుకు దాన్ని షోల్డర్స్‌లో నిలిపి వేస్తారు. కానీ మనదగ్గర ఇవి ఏ ప్రాంతంలోనూ మచ్చుకు కూడా కనిపించవు. ఫుట్‌పాత్‌లుగా పిలిచే కాలిబాటలపై ఉన్న ఆక్రమణలను తొలగించి వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలంటూ అనేక సార్లు హైకోర్టు, లోకాయుక్త వంటి వ్యవస్థలు హెచ్చరించాయి. రహదారికి పక్కన తప్పనిసరిగా కాలిబాటలు ఉండాలి. ఫలితంగా పాదచారులు వీటిని ఆశ్రయిస్తే ట్రాఫిక్ జామ్స్ తగ్గడంతో పాటు ప్రమాదాలు అదుపులోకి వస్తాయి. సిటీలో ప్రధాన రోడ్లతో పాటు యాక్సెస్ రోడ్లకూ ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రమణలో ఉన్నాయి. ఇలా జరగడానికి ఇంజినీరింగ్ లోపమే ప్రధాన కారణం.